



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్ ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 324 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 12-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



## లోక్‌సభలో స్పీకర్‌పై
# వీగిన అవిశ్వాసం

- మూజువాణి ఓటుతో తిరస్కరించిన సభ
- రెండ్రోజుల పాటు సభలో సుదర్ఘంగా చర్చ
- విపక్షాల తీరుపై మండిపడ్డ అమిత్ షా
- స్పీకర్‌ను అవమానించడం తగదని కాంగ్రెస్‌కు హితవు
- ఓటింగ్ అనంతరం సభ నేటికి వాయిదా

న్యూఢిల్లీ,
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో బుధవారంనాడు వీగిపోయింది. విపక్ష ఎంపీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహమ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని తొలి దఫా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చను ప్యానల్ స్పీకర్ జగదంబిక పాల్ చేపట్టారు. రాహుల్ గాంధీ, అమిత్‌షా, రవిశంకర్ ప్రసాద్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం ఓటింగ్ చేపట్టగా... మూజువాణి ఓటుతో ప్రతిపక్షాల తీర్మానం వీగిపోయింది. ఆ వెంటనే లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ గురువారంనాటికి వాయిదా వేశారు. స్పీకర్ సభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని

-మిగతా 2 లో

## ట్రాఫిక్ ఫ్రీ నగరంగా
# హైదరాబాద్

**తెలంగాణ రూపురేఖలు మార్చేలా రవాణా, వైద్యరంగం అభివృద్ధి**

- 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ
- హైదరాబాద్ నుంచి రోడ్డు కనెక్టివిటీ పెంచాలి
- రోడ్ల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు
- నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం






హైదరాబాద్
తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చే విధంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా, వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్ వర్క్ ను అభివృద్ధి చేయాలని అన్నారు.

-మిగతా 2 లో




## ఎమ్మెల్యేలకు
# స్పీకర్ క్లీన్‌చిట్

- దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై అనర్హత పిటిషన్లు కొట్టివేత.
- సుప్రీంకోర్టు గడువుకు ముందే తుది నిర్ణయం వెల్లడించిన స్పీకర్ గడ్డం ప్రసాద్.
- మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకూ ఊరట; ఫిరాయింపుల వివాదానికి తెర.
- 'నా ప్రాథమిక హక్కులను కాలరాయలేరు": స్పీకర్ తీర్పుపై దానం నాగేందర్ హర్షం.
- సుప్రీంకోర్టులో విచారణ ఉండగానే క్లియర్ అయిన అడ్డంకులు.

హైదరాబాద్
తెలంగాణ రాజకీయాల్లో కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ బుధవారం తుది నిర్ణయాన్ని ప్రకటించారు. విచారణ అనంతరం కడియం, దానం నాగేందర్‌కు ఊరట లభించింది. ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేశారు. దానం, కడియంపై దాఖలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, నిర్ణీత గడువు ముగుస్తుండటంతో స్పీకర్ కార్యాలయం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మొత్తం పదిమంది ఎమ్మెల్యేల్లో ఇప్పటికే ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు. దానం, కడియంలపై తాజాగా వాదనలు పూర్తికాగా.. నిర్ణయాన్ని ప్రకటించారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ లభించింది.

-మిగతా 2 లో



## ఐపిఎల్ 2026
# షెడ్యూల్ విడుదల

**28న బెంగళూరు, హైదరాబాద్ మధ్య తొలిపోరు**

ముంబయి:
ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్ 2026 షెడ్యూల్ విడుదలైంది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) బుధవారం 2026 ఐపిఎల్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఈ నెల 28 నుంచి టోర్నీ ప్రారంభం కానుంది. ప్రారంభ వేడుకల అనంతరం జరిగే తొలి మ్యాచ్‌లో.. గత ఏడాది విజేత బెంగళూరు(ఆర్సీబీ) జట్టు, హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) జట్టు తలపడనున్నాయి. 29న ముంబయి-కోల్‌కతా జట్ల మధ్య రెండో మ్యాచ్, మూడో మ్యాచ్ రాజస్థాన్, చెన్నై మధ్య ఈ నెల 30న జరగనున్నాయి. తొలి మ్యాచ్ జరిగే బెంగళూరు చిన్నస్వామి స్టేడియానికి సంబంధించి క్లియరెన్స్ సర్టిఫికెట్ రావాల్సి ఉంది. ఈ నెల 13న దీనిపై నిర్ణయం వెలువడుతుంది. సానుకూల నిర్ణయం వస్తేనే ఇక్కడ మ్యాచులు జరుగుతాయి. లేకుంటే ఓపెనింగ్ మ్యాచ్ సహా ఇతర మ్యాచులన్నీ మరో వేదికకు మారతాయి. గత ఏడాది ఆర్సీబీ విజయోత్సవ వేడుకల సందర్భంగా

-మిగతా 2 లో

# ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

- 15న సాయంత్రం ప్రత్యక్ష ప్రసారం



లాస్
ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే అతి పెద్ద వేడుక 'ఆస్కార్స్ 2026' 98వ అకాడమీ అవార్డ్స్ కు సర్వం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందించేందుకు లాస్ ఏంజెల్స్ లోని డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అగ్రశ్రేణి హాలీవుడ్ తారలు, ప్రతిభావంతులైన దర్శకులు, నిర్మాతలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆస్కార్ వేదికపై భారతీయ నటి ప్రియాంక చోప్రా కూడా ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్‌వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి ప్రముఖ స్టార్స్‌తో కలసి ఆమె వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు.98వ అకాడమీ అవార్డ్స్ ఈనెల 15న ఆదివారం అమెరికా కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరగనున్నాయి. కాల వ్యత్యాసం కారణంగా భారతదేశంలో

-మిగతా 2 లో

# తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

- రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం
- సిఎం రేవంత్ తదితరుల హాజరు



హైదరాబాద్
తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,

-మిగతా 2 లో



## పశ్చిమాసియా యుద్ధంపై
# రాజకీయాలా

**కాంగ్రెస్, కమ్యూనిస్టుల తీరుపై మండిపడ్డ ప్రధాని**

- గల్ఫ్‌లో చిక్కున్న వారిని ఇండియాకు తీసుకుని వస్తున్నాం
- అక్కడి ప్రభుత్వాలు భారత్‌కు అండగా నిలిచాయి
- రాహుల్‌కు అభివృద్ధి గురించి తెలియదు
- విమర్శించడమే రాహుల్‌కు తెలిసిన పని
- కేరళం పర్యటనలో మోడీ గాటు విమర్శలు


తిరువనంతపురం,
ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు.

-మిగతా 2 లో

## గ్యాస్ సంక్షోభం...
# హోటళ్లకు భారీ షాక్

**- హైదరాబాద్ సహా నగరాల్లో హోటల్ వ్యాపారాలపై ప్రభావం**






- గ్యాస్ లేదు... టిఫిన్ లేదు!
- మెను తగ్గింపు...
- టిఫిన్ సెంటర్ల మూత...
- ఉద్యోగులపై ప్రభావం
- పీజీ హాస్టళ్లలో టీ, బ్రేక్‌ఫాస్ట్ తగ్గింపు
- నీలగిరి ఎక్స్ ప్రెస్ ప్రత్యేక కథనం




హైదరాబాద్,మార్చ్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)
దేశవ్యాప్తంగా కమర్షియల్ గ్యాస్ కొరత ప్రభావం రోజురోజుకు స్పష్టంగా కనిపిస్తోంది. వంటగ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా మధ్యప్రాచ్య దేశాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు గ్యాస్ సరఫరాపై ప్రభావం చూపుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామం నేరుగా చిన్న వ్యాపారులు, హోటల్ రంగంపై పడుతోంది. ఇప్పటికే దేశంలోని పలు మహానగరాలు, పట్టణాల్లో గ్యాస్ కొరత కారణంగా హోటల్ కార్యకలాపాలు మందగించాయి.

-మిగతా 2 లో



# ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్

(మొదటి తరువాయి)

సుప్రీంకోర్టు సూచనల ప్రకారం మార్చి 12వ తేదీలోపు వీరిద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉండగా.. ఒకరోజు ముందే.. స్పీకర్ కడియం, దానం నాగేందర్ పై దాఖలైన రెండు పిటిషన్లను డిస్మిస్ శారు.

**దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు..**

స్పీకర్ తీర్పు తర్వాత దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని.. వ్యక్తిగత నిర్ణయంతోనే కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశానని దానం నాగేందర్ పేర్కొన్నారు. తన ఫండమెంటల్ రైట్‌ను కాలరాసే హక్కు ఎవరికీ లేదని.. ఆరు నెలలుగా క్షోభను అనుభవించానన్నారు. స్పీకర్‌ని కూడా ఆరు నెలలుగా ఇబ్బంది పెడుతూ వచ్చారని.. దానం పేర్కొన్నారు.

ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు పిటిషన్ వేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కారు గుర్తుతో పోటీచేసిన కడియం శ్రీహరి..కాంగ్రెస్‌లో చేరడాన్ని ప్రశ్నిస్తూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేవీ వివేకానంద గౌడ్ అనర్హత పిటిషన్ ఫైల్ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషనపై సుప్రీంకోర్టులో రేపు విచారణ జరుగనుంది. దాంతో.. అంతకంటే ముందే స్పీకర్ తన తీర్పును వెల్లడించారు.

## లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

(మొదటి తరువాయి)




ఆరోపిస్తూ విపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి బుధవారం వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్షాలు చేసిన విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాలు నిబంధనలు ఉల్లంఘిస్తేనే స్పీకర్ రంగంలోకి దిగారు. పార్లమెంటు నిబంధనలు నెహ్రూ హయాంలోనే రూపొందించారు. కాంగ్రెస్ రూపొందించిన నిబంధనలపై చర్చకు సిద్ధం. పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరిస్తారు. లోక్‌సభ నిబంధనల ప్రకారం స్పీకర్‌దే తుది నిర్ణయం. భారత ప్రజాస్వామ్యాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. స్పీకర్ ఉద్దేశాలను ఎవరూ తప్పు పట్టాల్సిన అవసరంలేదని అమిత్ షా అన్నారు. స్పీకర్ విధేయతను అనుమానించడం దురదృష్టకరం. స్పీకర్ స్థానం దిశగా ప్రతిపక్షసభ్యులు పేపర్లు విసిరారు. అందరూ లోక్‌సభ నిబంధనలు పాటించాలి. సభలో ఎలా మాట్లాడాలో థరూర్ నేర్పించాలి. కాంగ్రెస్ నేతలకు థరూర్ ఎందుకు హిత బోధ చేయరని అన్నారు. కాంగ్రెస్ నిబంధనలు పార్లమెంటును నడపజాలవు. తప్పులు సరిదిద్దుకొనేందుకు ప్రతిపక్షాలకు అవకాశం వచ్చిందని అమిత్ షా అన్నారు. దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒక స్పీకర్ పై ఇలాంటి తీర్మానం రావడం దురదృష్టకరమని, ఇది పార్లమెంటరీ సంప్రదాయాలను కించపరచడమే అని ఆయన పేర్కొన్నారు. స్పీకర్ స్థానాన్ని రాజకీయ కోణంలో చూడటం తగదని అమిత్ షా స్పష్టం చేశారు. 'స్పీకర్ పదవికి రాజకీయాలతో సంబంధం లేదు. సభలో ఆయన అందరివాడు, అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే స్పీకర్ ఎంపిక జరిగింది. అటువంటి వ్యక్తి నిబద్ధతను, నిష్పక్షపాత వైఖరిని ప్రశ్నించాల్సిన అవసరం లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. సభా నిబంధనలను కాంగ్రెస్ పార్టీ పదే పదే ఉల్లంఘిస్తోందని అమిత్ షా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం సభలో అమలవుతోన్న నిబంధనలు నెహ్రూ కాలంలో రూపొందబడ్డాయి, వాటిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సభా మర్యాదలను కాపాడటంతో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి, నిబంధనలను పాటించకుండా స్పీకర్ పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

## ఐపిఎల్ 2026 షెడ్యూల్ విడుదల

(మొదటి తరువాయి)

జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించిన సంగతి తెలిసిందే. అందుకే ఈ స్టేడియంలో మళ్లీ మ్యాచుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి రావాల్సి ఉంది. ఈ సీజన్‌కు సంబంధించి ప్రస్తుతానికి ఏప్రిల్ 12 వరకు జరిగే మ్యాచుల షెడ్యూల్ మాత్రమే విడుదలైంది. ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మ్యాచుల నిర్వహణ విషయంలో భద్రతాపరమైన సమస్యల కారణంగా బిసిసిఐ వేదికలను పూర్తిగా ఖరారు చేయలేదు.

## ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

(మొదటి తరువాయి)

ఈ వేడుకలను మార్చి 16 సోమవారం వేకువ ఝామున 4:30 గంటల నుంచి వీక్షించవచ్చు. తారల తళుకులతో రెడ్ కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం మొదలవుతుంది. ప్రముఖ హాస్యనటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓబ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ ప్రేక్షకులు ఆస్కార్స్ వేడుకలను డిజిటల్, టెలివిజన్ ప్లాట్‌ఫామ్‌లలో వీక్షించవచ్చు. స్టార్ మూవీస్‌లో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఉదయం చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి ఈ వేడుకను పునః ప్రసారం చేయనున్నారు. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

(మొదటి తరువాయి)



మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023-2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు విచ్చేశారు.

# ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్

(మొదటి తరువాయి)

నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో వీపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి చేయడానికి కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్య ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం తెలిపారు. దీని వల్ల జిల్లాల ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో భూ సేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జిహెచ్ఎంసి, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్ సెక్టార్ పాలసీ-2047 కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సమీక్షా సమావేశంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత



సమయంలో చేరుకునేలా రోడ్ల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ఏరియాలలో రోడ్ల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని, దీనిపై సాధ్యాసాధ్యాలు నిశితంగా అధ్యయనం చేయాలని సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇక పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, పెద్ద ఆసుపత్రుల పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా హాస్పిటల్స్ భవనాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా

(మొదటి తరువాయి)

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక

ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోడీ అన్నారు.

ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# గ్యాస్ సంక్షోభం...హోటళ్లకు భారీ షాక్


(మొదటి తరువాయి)





కమర్షియల్ సిలిండర్ల సరఫరా తగ్గిపోవడంతో హోటల్ నిర్వాహకులు మెను ఐటమ్స్ తగ్గించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అధిక గ్యాస్ వినియోగం అయ్యే వంటకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ, కేవలం కొన్ని ముఖ్యమైన ఐటమ్స్ మాత్రమే అందిస్తున్నారు. ఫుడ్ డెలివరీ సేవలను కూడా పలు రెస్టారెంట్లు పరిమితం చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో గ్యాస్ కొరత ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని టిఫిన్ సెంటర్లు ఇప్పటికే మూతపడగా, మరికొన్ని చోట్ల మెను గణనీయంగా తగ్గించారు. ముందుగా 8 నుంచి 10 రకాల టిఫిన్ ఐటమ్స్ అందించే హోటళ్లలో ఇప్పుడు కేవలం రెండు లేదా మూడు ఐటమ్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొన్ని చిన్న హోటళ్లలో అయితే కేవలం టీ, కాఫీ మాత్రమే అమ్మకాలు కొనసాగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. హోటళ్ల పని గంటలు కూడా తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ఉదయం నుంచి రాత్రి వరకు 10 గంటల పాటు నడిచే టిఫిన్ సెంటర్లు ఇప్పుడు మూడు లేదా నాలుగు గంటలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. దీంతో హోటల్ యజమానులతో పాటు అక్కడ పనిచేసే కార్మికుల జీవనోపాధి కూడా ప్రభావితమవుతోంది.

ఇక డొమెస్టిక్ సిలిండర్లను వాడుతున్న హోటళ్లపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కమర్షియల్ గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో కొంతమంది చిన్న వ్యాపారులు డొమెస్టిక్ సిలిండర్లను ఉపయోగించాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. అయితే ఇది నిబంధనలకు



విరుద్ధమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

హైదరాబాద్ ఐటీ కారిడార్ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, నానక్‌రామ్‌గూడ వంటి ప్రాంతాల్లో ఉన్న పీజీ హాస్టళ్లలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉంది. రోజుకు 15 నుంచి 20 వరకు కమర్షియల్ సిలిండర్లు వినియోగించే పెద్ద పీజీ హాస్టళ్లలో ప్రస్తుతం ఒకటి లేదా రెండు రోజులకు సరిపడే స్టాక్ మాత్రమే మిగిలి ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. టీ, కాఫీ, బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అదనపు భోజనాలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో హాస్టళ్లలో నివసించే ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నగరంలో సుమారు 11 వేల పీజీ హాస్టళ్లు ఉన్నాయని అంచనా. వీటిలో దాదాపు 10 లక్షల మంది ఉద్యోగులు నివసిస్తున్నట్లు సమాచారం. మెను తగ్గింపు నిర్ణయం వల్ల లక్షలాది మంది ఉద్యోగులు,



విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. గ్యాస్ సంక్షోభం కొనసాగితే హోటల్ రంగం మరింత కష్టాల్లో పడే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కమర్షియల్ గ్యాస్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని హోటల్ యజమానులు కోరుతున్నారు. లేదంటే చిన్న వ్యాపారాలు మూతపడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

గ్యాస్ సమస్యను ఎదుర్కొనేందుకు కొంతమంది హాస్టల్ మరియు హోటల్ నిర్వాహకులు విద్యుత్ స్టవ్లు, ఇండక్షన్ పరికరాలు వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. అయితే పెద్ద స్థాయిలో వంటకాలు తయారు చేయడానికి అవి పూర్తిగా సరిపోవని వ్యాపారులు చెబుతున్నారు. మొత్తానికి కమర్షియల్ గ్యాస్ కొరత దేశవ్యాప్తంగా హోటల్ రంగాన్ని కుదిపేస్తోంది. సమస్య త్వరగా పరిష్కారం కాకపోతే చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు మూతపడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం

**పెద్దపల్లి, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.రంగపూర్‌లోని రాధాకృష్ణ ఏసీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మంత్రి అట్లూరి లక్ష్మణ్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. మార్చి 15లోపు పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ పరిష్కారం కోసం చర్యలు చేపట్టామని తెలిపారు.జిల్లాలో 6.8 లక్షల జనాభాకు రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియలో కొనసాగుతోందని వివరించారు. సోలార్ ప్యానెల్స్




ఏర్పాటు, ఎరువుల వినియోగం తగ్గింపు, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు, క్రీడాకారులకు సహాయం, ఎస్సీ ఎస్టీ రైతులకు విద్యుత్ కనెక్షన్లు, ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, బాలికలకు హెచ్‌పివి టీకాలు వంటి అంశాలను ప్రజా ప్రతినిధులు ప్రజలకు చేరవేయాలని సూచించారు.అడ్వాన్స్డ్ ట్రేడ్ సెంటర్లలో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టి యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తహసీల్దార్గా బాధ్యతలు స్వీకరించిన నెనవత్ రాములు



**అమ్రాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండల తహసీల్దార్ శైలేంద్ర కుమార్ ప్రభుత్వ బదిలీ ఉత్తర్వుల మేరకు జిహెచ్ఎంసి, హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు.ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ నెనవత్ రాములు గారికి అమ్రాబాద్ మండల తహసీల్దార్ బాధ్యతలు తాత్కాలికంగా అప్పగించారు.

# కవ్వంపల్లి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం విజయవంతం చేయాలి

**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రేపు గాంధీభవన్‌లో జరగబోయే టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు.కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా నియమించబడి రేపు ఉదయం 11 గంటలకు ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ర్యాలీ ప్రారంభమవుతుందని, అనంతరం జగ్జీవన్‌రామ్ విగ్రహం, గన్‌పార్క్ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించి మధ్యాహ్నం 3 గంటలకు గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,




పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరవుతారని చెప్పారు.దళితుల సమస్యల పరిష్కారం కోసం కవ్వంపల్లి సత్యనారాయణ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా దళిత వర్గం ముందుకు నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మెరుగైన రేపటి కోసం హరిత రసాయన శాస్త్రంపై జాతీయ సదస్సు




**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కరీంనగర్‌లో మెరుగైన రేపటి కోసం హరిత రసాయన శాస్త్రం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించబడుతోంది. కళాశాల రసాయన శాస్త్ర విభాగం తెలంగాణ ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో ఈ సదస్సును ఏర్పాటు చేసింది.సదస్సుకు శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ముఖ్య అతిథిగా, డా. సరసిజ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. ఐఐటి మద్రాస్, ఎన్ఐటి వరంగల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్ నుండి శాస్త్రవేత్తలు, ఆచార్యులు పాల్గొననున్నారు.శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సదస్సు విజయవంతం కావాలని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి ఆకాంక్షించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మంచిర్యాల, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.చెన్నూర్ పట్టణంలోని పాత మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ ప్రసాద్ తివారి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, పాపిరెడ్డి వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.మంత్రి మాట్లాడుతూ రైతు రుణమాఫీ పథకంలో భాగంగా రాష్ట్రంలోని రైతుల ఖాతాల్లో 23 వేల కోట్ల రూపాయలు జమ చేశామని, రైతు భరోసా పథకం కింద 9 వేల కోట్ల రూపాయలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశంలోనే



తెలంగాణలో రైతుల వద్ద నుండి అధిక మొత్తంలో పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నామని అన్నారు.చెన్నూర్ పట్టణంలో బస్ డిపో ఏర్పాటు, నీటి పారుదల ప్రాజెక్టులు, త్రాగునీటి సరఫరా కోసం అమృత్ పథకం పనులు, రహదారి విస్తరణ, మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. రైతులకు పంట మార్పిడి, వాణిజ్య పంటల సాగు, విక్రయం వంటి అంశాల్లో మార్కెట్ కమిటీ ప్రతినిధులు సహకరించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు వరి, పత్తి ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు చెన్నూర్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, పారిశుధ్య పనులు, గిరిజన ఆశ్రమ పాఠశాలలో అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు.

# 5వ డివిజన్ కార్పొరేటర్‌కు ఘన సన్మానం



**కరీంనగర్ రూరల్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ 5వ డివిజన్ కార్పొరేటర్ గాదె రూప శ్రీనివాస్‌ను బొమ్మకల్ ఆదర్శ రైతు మిత్ర సంఘం, రాజరాజేశ్వర కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రైతు మిత్ర సంఘం అధ్యక్షుడు మంద రాజిరెడ్డి, కాంరెడ్డి నారాయణ రెడ్డి, పురుమాళ్ల శ్రీనివాస్, మంద రమణారెడ్డి, కాంరెడ్డి భాస్కర్ రెడ్డి, చింతల శ్రీనివాస్, మాచినేని నారాయణ, భీరం ఆంజనేయులు, రాజరాజేశ్వర కాలనీ చైర్మన్ గాండ్ల లక్ష్మినారాయణ, సాయిలు గౌడ్, బొల్లం నర్సయ్య, కరుకూరి తిరుపతి, ఎనగంటి సందీప్, కీర్తి రెడ్డి, గాండ్ల మల్లయ్య, రాజేందర్, లింగయ్య, నారాయణ రాజు, బ్రీజ్ మోహన్‌తో పాటు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

# బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.మంగళవారం స్థానిక బస్టాండ్ ఇన్ గేట్ వద్ద భారీ స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహన తనిఖీలు చేపట్టారు. ఆటోలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు డ్రైవింగ్ లైసెన్స్,ఆర్సి, ఇన్సూరెన్స్ పత్రాలు లేని వాహనాలను గుర్తించి 57 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసిన వాహన యజమానులు, డ్రైవర్లకు జరిమానాలు విధించి, అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.ఈ డ్రైవ్‌లో రిజర్వు ఇన్స్పెక్టర్ కుమారస్వామి, ఎస్సై ప్రమోద్ రెడ్డి, ఇతర



అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## నూతన గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపిన తల్లోజు ఆచారి

**హైదరాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను రాజ్‌భవన్‌లో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై శిక్షణ



**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శిక్షణ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని అన్నారు. ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, విధానాలపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన కార్యాచరణలోని అంశాలు, మహిళల--పిల్లల సంరక్షణ చట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్తు, విద్య, వైద్య రంగాల్లో అమలు చేస్తున్న కొత్త విధానాలపై శిక్షణలో వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ డీడీ నాగలేశ్వర్, డివైఎస్ఓ శ్రీనివాస్, హౌసింగ్ శాఖ పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పదవ తరగతి పరీక్షల ఏర్పాట్లపై విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు శ్రీహరి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ సంచాలకులు, జిల్లా స్థాయి పరిశీలకులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పరీక్షల కోసం అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేలా అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాల్లో 13,157 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు.

# ఆసుపత్రిలో ఇంద్ర మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



**రామగుండం, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లిఇంద్ర మహిళా శక్తి క్యాంటీన్‌లిను ఎమ్మెల్యే ఎం. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు పరిశుభ్రమైన, తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించేందుకు ఈ క్యాంటీన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా నిర్వహించబడే ఈ క్యాంటీన్ మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు ఆయన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కమిషనర్ ప్రఫుల్ దేశాయి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, పలువురు కార్పొరేటర్లతో కలిసి డంపింగ్ యార్డును పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ, గతంలో కేంద్ర మంత్రి కట్టర్, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని, ముఖ్యమంత్రి సభా వేదికపై డంపింగ్ యార్డును తరలిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కరీంనగర్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. డంపింగ్ యార్డును



వరంగల్--కరీంనగర్ మధ్యలో ఏర్పాటు చేసి, రెండు నగరాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యర్థాల నిర్వహణ చేపడతామని చెప్పారు. ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను తరలించేందుకు ప్రత్యేక విధానం రూపొందిస్తున్నామని, ఒక స్వచ్ఛంద సంస్థ కూడా ముందుకు వస్తోందని తెలిపారు. డంపింగ్ యార్డు వల్ల ప్రజలు శ్వాసకోశ సమస్యలు, అనారోగ్యాలు ఎదుర్కొంటున్నారని, రాజకీయాలకతీతంగా ప్రజా ప్రతినిధులుగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఒక సంవత్సరంలోపు పూర్తిస్థాయిలో తరలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ హైమావతి



**హుస్నాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోహెడ మండలంలోని శనిగరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కూరలను తనిఖీ చేసిన కలెక్టర్, పలుచగా ఉన్న పప్పుపై అసహనం వ్యక్తం చేస్తూ మీ ఇంట్లో కూడా ఇంత పల్చగా పప్పు వండుతారా అని వంట సిబ్బందిని ప్రశ్నించారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన ఆహారం అందించాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడి కేంద్రంలో పిల్లలు, గర్భిణీ స్త్రీలకు బలవర్ధక ఆహారం అందించాలని, ముఖ్యంగా మునగాకు వాడాలని సూచించారు. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి భోజనం గురించి అడగగా వారు గుడ్డు అన్నం తిన్నామని తెలిపారు. తరువాత తంగళ్లపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేసి కామన్ డైట్ మెనూ ప్రకారం రుచికరంగా వండాలని సూచించారు. విద్యార్థులకు భోజనం, వసతి, చదువులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు.

# హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం





**హుస్నాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి మున్సిపల్ బడ్జెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.21 కోట్ల 88 లక్షల అంచనా ఆదాయం, వ్యయంతో మున్సిపల్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీకి వచ్చే ఆదాయాన్ని సద్వినియోగం చేసుకుని పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను స్థానిక పార్లమెంట్ సభ్యులతో కలిసి తీసుకువచ్చి పట్టణ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. పచ్చదనం, పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా హుస్నాబాద్ పట్టణంలో మౌలిక వసతులు, పచ్చదనం, పారిశుభ్రతను మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కమిషనర్ మల్లికార్జున్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు



**కరీంనగర్ రూరల్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బొమ్మకల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 6వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్, మాజీ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇంచార్జ్ కపిల్ మాధవ పాల్గొన్నారు. నాయకులు విద్యార్థులకు పరీక్షలపై భయపడకుండా సిద్ధమై తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి పెన్నులు, పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# కోతులు, పందులు, కుక్కల సమస్యపై మంత్రిని కలిసిన ప్రతిపక్ష నేతలు



**హుస్నాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మున్సిపాలిటీలో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులు కలిసి ప్రాంతంలో నెలకొన్న కోతులు, పందులు, కుక్కల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. నాయకులు మాట్లాడుతూ కోతుల వల్ల వరి తప్ప ఇతర పంటలు సాగు చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు దిగుబడిలో నష్టపోతున్నారని తెలిపారు. ఆసుపత్రులకు నెలకు సుమారు 200 మంది వరకు కోతులు, కుక్కల దాడులతో గాయపడిన వారు వస్తున్నారని వివరించారు. సమస్య తీవ్రతను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. అదేవిధంగా మున్సిపాలిటీలో సీసీ రోడ్ల పనుల్లో నిబంధనలు పాటించకుండా పాత రోడ్లపై మళ్లీ రోడ్లు వేయడం వల్ల ఇండ్ల కంటే రోడ్లు ఎత్తుగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి, బీఎస్పీ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, రైతు సంఘం నాయకులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి, వరియోగుల అనంత స్వామి, గాదాసు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత



**మంచిర్యాల, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. జైపూర్ మండలం ఇందారం గ్రామంలో గ్రామైఖ్య సంఘాల భవనాలకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 30 లక్షల రూపాయల వ్యయంతో మూడు గ్రామైఖ్య సంఘాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 3.50 కోట్లతో 35 భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, క్యాంటీన్లు, కోళ్ల పెంపకం వంటి వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణ సదుపాయం, బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాయితీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. జైపూర్ మండలానికి 753 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అర్హులైన వారికి వచ్చే విడతలో అందజేస్తామని చెప్పారు. 15 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఉచితంగా అందించి భవిష్యత్తులో క్యాన్సర్ నివారణకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. జైపూర్‌లో 1250 మెగావాట్ల పవర్ ప్లాంట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, భూములు కోల్పోయిన వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజా సంక్షేమంలో భాగంగా గ్యారంటీ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని, 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల పెంపు, విద్యార్థుల సంఖ్య పెంపు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామైఖ్య సంఘాల మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

# నర్మెట్టలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం



**సిద్ధిపేట, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఈ నెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో వ్యవసాయ యాంత్రికీకరణ పథకంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాలకు చెందిన 38 మంది రైతులకు రూ.53.80 లక్షల విలువైన 36 రోటోవేటర్లు, 2 స్ట్రాబెలర్స్‌ను 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రైతుల శ్రమను తగ్గించి అధిక దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం యాంత్రికీకరణ పథకాన్ని అమలు చేస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహించి వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ కింద మరిన్ని వ్యవసాయ పరికరాలను అందించే అవకాశం ఉందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, ఆత్మ కమిటీ చైర్మన్ ఐలయ్య, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు నైపుణ్యం తప్పనిసరి




**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రస్తుత రోజుల్లో విద్యతో పాటు నైపుణ్యాలు కూడా తప్పనిసరిగా ఉండాలని, అప్పుడే ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా అన్నారు. శాతవాహన యూనివర్సిటీలో జరిగిన అకాడమిక్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మార్కులతో పనిలేదని, మంచి స్కిల్స్ కనబరిచిన వారే రాణించగలరని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ ఏఈడిపి ద్వారా విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి విద్య, నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాది 1200 మంది విద్యార్థులు ఈ శిక్షణ పూర్తి చేసుకొని పలు రంగాల్లో స్థిరపడ్డారని, ఈ ఏడాది 8 వేల మందికి లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాళ్లు విద్యార్థులను ప్రోత్సహించి ఏఈడిపిలో 100 శాతం సీట్లు నింపాలని సూచించారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేనా మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను నైపుణ్యాలతో తీర్చిదిద్దాలని, ఏఈడిపి ద్వారా శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యం నేర్చుకోవడానికి ఏఈడిపి ఒక మంచి వేదిక అని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాతవాహన వైస్ ఛాన్సిలర్ యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం ఏర్పాటు చేసి ఏఈడిపి అమలు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, శాతవాహన రిజిస్ట్రార్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతతో

# పాటు మనోవికాసం సాధించాలి

- మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న



**నెల్లికుదురు,మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు నెల్లికుదురు మండలంలోని ఎస్.సి. బాలుర వసతి గృహాన్ని ప్రత్యేక అధికారి జినుగు మరియన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలి. విద్యతో పాటు క్రీడలు, వ్యాయామం, మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. వ్యక్తిగత పరిశుభ్రత, తాజా ఆహారం, పరిసరాల శుభ్రత తప్పనిసరి. జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనపడితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలి" అని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి ఎల్. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై కలెక్టర్ హైమావతి పరిశీలన



**హుస్నాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తంగళ్లపల్లి గ్రామ శివారులో 23 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను పరిశీలించి, నిర్మాణ ప్రాంతాన్ని మొత్తం సందర్శించారు. రాష్ట్రంలోనే వేగంగా పురోగతి సాధిస్తున్న ఈ విద్యాసంస్థ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు తరచూ పనులను పర్యవేక్షించాలని సూచించారు. తరువాత శనిగరం గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ శుద్ధి ప్రక్రియను పరిశీలించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు శుద్ధమైన తాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని కలెక్టర్ పేర్కొన్నారు. వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. గ్రామాల్లో నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# రామవరం గ్రామంలో సౌర విద్యుత్ వెలుగులు



**హుస్నాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామాన్ని సోలార్ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన సందర్భంగా గ్రామ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ బొమ్మ శ్రీశైలం మాట్లాడుతూ, మన గ్రామంలోని ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇది ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడే ప్రాజెక్టు అవుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి పెద్ద ప్రవీణ్, రైతు ఆత్మ డివిజన్ చైర్మన్ జంగపల్లి ఐలయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ బుర్ర ప్రభాకర్, ఉప సర్పంచ్ లింగాల కనకయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పంగ రాకేష్, ఎండి బషర్, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి మండలంలో గ్యాస్ కొరత



**పాలకుర్తి, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలంలో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా ఏర్పడింది. కేశోరాం గ్యాస్ ఏజెన్సీకి వారం రోజులుగా సిలిండర్ లోడు రాక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలో గ్యాస్ అయిపోయిన వారు కట్టెల పొయ్యిలు, ఎలక్ట్రిక్ హీటర్లను ఆశ్రయించగా, కమర్షియల్ వినియోగదారులు వ్యాపారాలకు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు సిలిండర్లు ఎప్పటికి వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. కేశోరాం ఏజెన్సీ పరిధిలో దాదాపు ఆరువేల మంది వినియోగదారులు ఉన్నారని, గ్యాస్ కొరతను దృష్టిలో పెట్టుకుని గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని సంస్థలు సూచించాయి.

# విద్యార్థుల భవిష్యత్తుపై మబ్బులు
# కమ్మె విద్యా కమిషన్ సిఫారసులు



ఆకునూరి మురళి గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ చేసిన సిఫారసులు ప్రభుత్వ విద్యా కమిషన్ చేసినట్లుగా కాకుండా, కార్పొరేట్ విద్యా కమిషన్ సూచనల మాదిరిగానే కనిపిస్తున్నాయి. ఈ సిఫారసులు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధంగా, చదువుకు దూరం చేసే విధంగా ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని సమాజానికి అందించే ఉపాధ్యాయుల జీవితాలను కూడా చీకటి ప్రపంచంలోకి నెట్టే విధంగా ఈ సూచనలు కనిపిస్తున్నాయి.

**మాతృభాష అవసరం లేదట --- ఇది ఎంతవరకు సమంజసం?**

రాష్ట్రవ్యాప్తంగా తెలుగు తప్పనిసరి అని కేవలం స్టేట్ బోర్డు పాఠశాలల్లో మాత్రమే కాకుండా, రాష్ట్రంలో ఉన్న సీబీఎస్సీ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి ఇతర బోర్డులకు అనుబంధంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా 2026--27 విద్యాసంవత్సరం నుండి తప్పనిసరిగా బోధించాలి అని ప్రభుత్వం ఇప్పటికే సర్క్యులర్ జారీ చేసింది.

అయితే ఇదే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ మాత్రం నర్సరీ నుండి యూనివర్సిటీ వరకు విద్యాబోధన పూర్తిగా ఇంగ్లీషులోనే జరగాలని సిఫారసు చేయడం శోచనీయం. ఇది మాతృభాషను, అంటే తల్లి భాషను అవమానపరచడమే అన్న భావన కలుగుతోంది.

తల్లి గర్భం నుండి బయటపడ్డ తర్వాత మనం పలికే మొదటి పలుకు అమ్మ భాషే. మాతృభాష తీయదనం జీవితాంతం మరువలేనిది. ఇప్పటికే రాష్ట్రంలో మాతృభాషకు ప్రాధాన్యం తగ్గుతున్న వేళ ఈ సిఫారసు మాతృభాష మనుగడకే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

మనలో కొత్త ఆలోచనలు, భావాలు సహజంగా పుట్టుకొచ్చేది మాతృభాష ద్వారానే. మన భావోద్వేగాలను, మన అనుభూతులను మాతృభాషలోనే సులభంగా, సహజంగా వ్యక్తపరచగలం. పరాయి భాషలో అదే భావాలను అదే ఆహ్లాదంతో వ్యక్తీకరించడం అంత సులభం కాదు.

మాతృభాషను పక్కన పెట్టడం అంటే విద్యార్థులను తమ మూలాల నుండి, సంస్కృతి సంప్రదాయాల నుండి దూరం చేయడమే. "మొక్కై వంగనిది మానై వంగునా" అన్నట్టు చిన్నతనంలోనే మాతృభాషను నేర్పించకపోతే ఇంకెప్పుడు నేర్చుకుంటారు? మన సంస్కృతి సంప్రదాయాలు మట్టిలో కలిసిపోవాలా?

**డిగ్రీ గురుకులాలు రద్దు చేయాలనడం విడ్డూరం**

రాష్ట్రంలోని అన్ని సొసైటీ డిగ్రీ గురుకులాలలో ప్రధానంగా పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఆదివాసి గ్రామీణ కుటుంబాల బిడ్డలే విద్యను అభ్యసిస్తున్నారు.

ఇలాంటి గురుకులాలను రద్దు చేయడం అంటే పేద విద్యార్థుల నోట్లో మట్టి కొట్టినట్టే. ఇది వారిని ఉన్నత విద్యకు దూరం చేసే పన్నాగంలా కనిపిస్తోంది.

డిగ్రీ గురుకులాల్లో అడ్మిషన్లు పూర్తిగా నిండడం లేదని చెప్పడం ఒక కుంటి సాకే. అడ్మిషన్లు పూర్తి కాకపోవడానికి కారణం ఎవరు? ప్రభుత్వం కూడా దీనిపై ఆలోచించాలి.

గురుకుల డిగ్రీ కాలేజీలను దోస్త్ (ఋూూ) అడ్మిషన్ ప్రక్రియలో చేర్చాలి. లేదా ఇంటర్ విద్యార్థులకు గురుకుల కాలేజీలపై అవగాహన కల్పించి, కాలేజీలలో మౌలిక వసతులు మెరుగుపరచి, నాణ్యమైన భోజనం మరియు విద్యా ప్రమాణాలను పెంచాలి.

అవసరమైతే గురుకుల ప్రవేశ పరీక్షను రద్దు చేసి, ఇంటర్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు కేటాయించవచ్చు. కానీ దేవాలయాల్లాంటి ఈ విద్యాసంస్థలను మూసివేయడం అనేది పేద, బలహీన వర్గాల భవిష్యత్తును చీకటిలోకి నెట్టడమే అవుతుంది.

గురుకులాల్లో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు పేరుగాంచిన విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీహెచ్‌డీ సీట్లను సాధించారు. అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా ఎంపికయ్యారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రద్దు --- పేదలకు భారమే**

ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయాలని కమిషన్ సిఫారసు చేయడం సిగ్గుచేటు.

ఇది పూర్తిగా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యంతో కుమ్మక్కై తీసుకున్న నిర్ణయంలా కనిపిస్తోంది. పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ రక్తాన్ని చెమటగా మార్చి సంపాదించిన డబ్బును ఫీజుల పేరుతో జలగల్లా పీల్చుకునే పరిస్థితి వస్తుంది.

స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ నాయకులు తమ ఇళ్ల నుండి ఇచ్చేవి కావు. అవి విద్యార్థుల హక్కులు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు, బీసీ విద్యార్థులకు 60 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తున్న పథకాన్ని రద్దు చేయడం వల్ల మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను కోల్పోయే ప్రమాదం ఉంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు వెన్నుముకలాంటిది. కాబట్టి దీన్ని రద్దు చేయడం సమంజసం కాదు.

**ఎప్ సెట్ రద్దు --- కార్పొరేట్ కాలేజీలకే లాభం**

రాష్ట్రంలో ఎప్ సెట్ పరీక్షను రద్దు చేసి ఇంటర్ మార్కుల ఆధారంగా ఇంజనీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ కాలేజీల్లో అడ్మిషన్లు ఇవ్వాలని సిఫారసు చేయడం కార్పొరేట్ ఇంటర్ కాలేజీల యాజమాన్యాలకు లాభం చేకూర్చే నిర్ణయంగా కనిపిస్తోంది.

మార్కులనే పరమావధిగా తీసుకుని నడిపే కార్పొరేట్ కాలేజీల వ్యాపారం పెరగడానికే ఇది దోహదపడుతుంది. దీనివల్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే అనేక మంది విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ కాలేజీల సీట్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది.

**పాస్ శాతం పెంపు --- విద్యార్థులపై ఒత్తిడి**

పది, ఇంటర్ పాస్ పర్సంటేజ్‌ను 35% నుండి 45%కి డిగ్రీ మరియు పీజీ లో 50% పెంచాలి అనే సిఫారసు కూడా ఆందోళన కలిగిస్తోంది.

విద్యార్థుల జీవితం పర్సంటేజ్‌తోనే ముడిపడి ఉందా? పరీక్షల్లో వచ్చిన మార్కులే వారి ప్రతిభకు ప్రమాణమా? ప్రతి విద్యార్థి ప్రతిభ ఒకేలా ఉండదు.

కొంతమందికి చదువుపై ఆసక్తి ఉంటే, మరికొందరికి ఆటలు, సంగీతం, కళలపై ఆసక్తి ఉంటుంది. కాబట్టి విద్యార్థులను కేవలం పుస్తకాల పురుగులుగా మార్చడం సరైంది కాదు.

పాస్ పర్సంటేజ్ పెంచడం వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరిగి వారి కలలు, ప్రతిభలు కాలరాయబడే ప్రమాదం ఉంది. పాస్ శాతం పెంచడం కంటే విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం పై దృష్టి పెట్టాలి.

**టీచర్ల జీతాలు తగ్గించాలనడం అన్యాయం**

అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి అత్యంత విశిష్టమైనది. ఇది కేవలం ఉద్యోగం కాదు, సమాజ నిర్మాణానికి పునాది.

"తరగతి గది నాలుగు గోడల మధ్యే దేశ భవిష్యత్తు నిర్మాణం అవుతుంది" అని స్వామి వివేకానంద గారు చెప్పిన మాటలు యాదృచ్ఛికంగా చెప్పినవి కావు.

ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే కాకుండా మానవత విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, నీతి, నిజాయితీ వంటి విలువలను కూడా నూరిపోస్తారు.

ఇలాంటి ఉపాధ్యాయుల జీతాలను తగ్గించాలని సిఫారసు చేయడం వారి ఆత్మగౌరవాన్ని అవమానపరచడమే.

**ఐదేళ్లకు ఒకసారి టీచర్లకు పరీక్ష --- అవసరమా?**

ఉపాధ్యాయులు ఉద్యోగంలోకి వచ్చే ముందు టెట్, డీఎస్సీ వంటి కఠినమైన పరీక్షలు పాస్ అయ్యే తర్వాతే ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికవుతారు.

ఇలాంటి పరిస్థితిలో ఐదేళ్లకు ఒకసారి పరీక్ష నిర్వహించడం అంటే వారిని అభద్రత భావనలోకి నెట్టడమే. ఈ భయంతో వారు విద్యార్థులకు సరైన బోధన అందించగలరా అనే ప్రశ్న తలెత్తుతుంది.

పరీక్షల కంటే ఉపాధ్యాయులకు నూతన బోధనా విధానాలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం మరింత ప్రయోజనకరం.

సమాజ హితం దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు అవసరం

ఈ విధంగా విద్యా కమిషన్ చేసిన సిఫారసులు ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల్లో అనేక సందేహాలను రేకెత్తిస్తున్నాయి. కాబట్టి విద్యా వ్యవస్థను బలోపేతం చేసే విధంగా, సమాజంలోని అన్ని వర్గాల మేలు దృష్టిలో పెట్టుకొని కమిషన్ తన సిఫారసులను ప్రభుత్వాన్నికి సూచించాలని విజ్ఞప్తి.

హరీష్ సాగర్
సాందీపని మాసపత్రిక స్టేట్ కన్వీనర్
6302758830



## సెన్సెస్--2027 శిక్షణలో కలెక్టర్ హైమావతి దిశానిర్దేశం




**సిద్దిపేట, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత జిల్లా అధికారులకు సెన్సెస్--2027 ప్రక్రియపై శిక్షణ తరగతులు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాల్గొని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన దేశానికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రభుత్వ ప్రణాళికలు, విధాన నిర్ణయాలు, నిధుల కేటాయింపులో ఈ డేటా ఉపయోగపడుతుందని తెలిపారు. 2027 సెన్సెస్‌లో ఫేస్--1లో గృహాల జాబితా, ఫేస్--2లో జనాభా వివరాలు సేకరించనున్నట్లు చెప్పారు. ఈసారి గణన పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతుందని, మొబైల్ యాప్ ద్వారా డేటా అప్లోడ్ చేయబడుతుందని వివరించారు. మే నెలలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు మూడు రోజుల శిక్షణ పొందాలని, నియమావళి ప్రకారం ప్రక్రియను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సెన్సెస్--2027ను విజయవంతంగా పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆదేశించారు. సర్టిఫికెట్ మంజూరులో ఒకటికి రెండుసార్లు చెక్ చేసి మాత్రమే మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, సిపిఓ దశరథ్, డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అసిస్టెంట్ సెన్సెస్ అధికారి రమాదేవి, ఉష తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అట్లాస్ పంపిణీ




**కమలాపూర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: కందుగుల గ్రామ సర్పంచ్ ముప్పు మహేశ్ స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు 18 అట్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు ఓరుగంటి తిరుపతి, సమ్మయ్య నాగిరెడ్డి, ఆగన్న, విజయలక్ష్మి, మమత, శ్యామలతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితునికి శిక్ష



**పాలకుర్తి, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకుని మోసం చేసిన నిందితుడికి పెద్దపల్లి కోర్టు 13 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే, బసంతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన గుండు నరేష్ 2017లో అదే గ్రామానికి చెందిన ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ విజయేందర్ కేసు నమోదు చేసి నరేష్‌ను రిమాండ్‌కు పంపించారు. ప్రస్తుతం ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణలో కేసు విచారణ జరిపి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకేన రవీందర్ వాదనలు వినిపించగా, నిందితుడి నేరం రుజువై కోర్టు శిక్ష విధించింది. ఈ కేసులో సాక్షులను ప్రవేశపెట్టడంలో బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్, సీఐ ప్రవీణ్ కుమార్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, మల్లేష్, కోటేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. నిందితుడికి శిక్ష పడటంతో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వారిని అభినందించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్--సిరిసిల్ల బైపాస్ రోడ్డులో వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలకు కారణమవుతున్న గుంతల మరమ్మత్తులకు చర్యలు ప్రారంభమయ్యాయి. మంగళవారం టౌన్ ఏసీపీ వెంకటస్వామి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుంతల తీవ్రతను స్వయంగా పర్యవేక్షించి, తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు.



వాహనదారులు ఇబ్బందులు పడకుండా, ప్రమాదాలను అరికట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఏసీపీ తెలిపారు. ప్రజా భద్రతే ప్రథమ కర్తవ్యమని, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి సాఫీగా ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ రాంచంద్రావు, టూటౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి, రోడ్డు ఇంజనీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
గురువారం 12 మార్చి 2026

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్ రూరల్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలబోతారం, వల్లంపహాడ్, నగునూరు గ్రామ శివారులోని మూల వాగులో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలబోతారం గ్రామానికి చెందిన పైడి అజయ్ వాగు నుండి ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకొని కరీంనగర్ వైపు తరలిస్తుండగా వల్లంపహాడ్ బ్రిడ్జి వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. గ్రామాల్లో మరికొందరు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిందని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# యాక్సిడెంట్లో గాయపడి చికిత్స పొందుతూ మృతి



**కరీంనగర్ రూరల్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈ రోజు ఉదయం 11:30 గంటలకు తీగలగుట్టపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటస్వామి జూపిటర్ మోటార్‌సైకిల్‌పై కరీంనగర్ వైపు వెళ్తుండగా, వెనుక నుండి అతివేగంగా వచ్చిన హోండా షైన్ మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. దీంతో వెంకటస్వామి తలకు, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో కిందపడిపోయాడు. వెంటనే అతన్ని కరీంనగర్‌లోని ఒమేగా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటస్వామి కుమారుడు మిట్టపల్లి ప్రశాంత్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, రూరల్ పోలీసులు హోండా షైన్ నడిపిన చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన సింగసాని రాజకుమార్‌పై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంకటస్వామి మరణానికి కారణమైన రాజకుమార్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ సమావేశం




**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ నిర్ణయాలను అమలు చేయుటకు కరీంనగర్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ కవ్వంపల్లి రవి ఆధ్వర్యంలో జిల్లా సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు హాజరై మాట్లాడుతూ, రెండవ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న మున్సిపాలిటీల ముందు ధర్నాలు, కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించాలని, మార్చి 24న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ మున్సిపల్ సంఘం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 22, 23 తేదీల్లో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపల్లి పోచయ్య, జిల్లా కోశాధికారి దాసరి రాజమల్లయ్య, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ అధ్యక్షుడు మనుపాటి మల్లేశం, హుజరాబాద్ కమిటీ నుండి రాసపల్లి సరోజన, రామగిరి సులోచన, డ్రైవర్స్ యూనియన్ భాద్యులు జంగం రవీందర్, కమిటీ సభ్యుడు బెజ్జంకి స్వామి, హరితహారం నాయకులు జోగు గంగయ్య, దాసరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా--ఇజ్రాయిల్ దమనకాండను వ్యతిరేకిద్దాం

**కరీంనగర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అఖిల భారత కమిటీ పిలుపు మేరకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని పిలుపునిచ్చారు. ట్రంప్, నేతన్యాహు ప్రభుత్వాలు ఇరాన్‌పై దాడి చేసి పసిపిల్లల ప్రాణాలను బలిగొనడం దారుణమని పేర్కొన్నారు. అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం సాధించాలన్న ప్రయత్నాలను విరమించుకోవాలని, భారత విదేశాంగ శాఖ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని ఇరాన్‌పై జరుగుతున్న దాడులను ఖండించాలని వారు డిమాండ్ చేశారు. ఈ




కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కంపల్లి అరవింద్, సహాయ కార్యదర్శులు ఇసాక్, ఆకాష్, నాయకు అంజి, సన్నీ, రాకేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ నాయక్, రాజు కుమార్, అశోక్, సహాయ కార్యదర్శి అరవింద్, నాయకులు అజయ్, విజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

**వనపర్తి,మార్చి 11 (నీలగిరి ఎక్స ప్రెస్):**
వనపర్తిజిల్లా మిరాస్పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందించిన జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి పరీక్షల్లో విజయాలు సాధించాలని విద్యార్థులను కోరారు. గ్రామ సర్పంచ్ కర్నాటి వైదేవి, అమ్మ ఆదర్శ కమిటీ




చైర్మన్ హరిత విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ చదువులో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు, పెన్నులు, స్కేలు, జ్యామెట్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలోప్రధానోపాధ్యాయుడు ఎం. సత్యనారాయణ, సర్పంచ్ కర్నాటి వైదేవి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాద గోవర్ధన్ గౌడ్‌కు ‘గౌరవ డాక్టరేట్’ పురస్కారం

**దేవరకొండ మార్చి 11. (నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న పి.ఏ.పల్లి మండలం, అక్కంపల్లి గ్రామానికి చెందిన మాద గోవర్ధన్ గౌడ్ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందారు. ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ వారు ఆయన సేవలను గుర్తించి “గౌరవ డాక్టరేట్” అవార్డును ప్రకటించారు. మంగళవారం (మార్చి 10, 2026) హైదరాబాద్‌లోని సిటీ కల్చరల్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా గోవర్ధన్ గౌడ్ ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి సుమారు 200 మంది ప్రతినిధులు (డెలిగేట్స్) పాల్గొన్నారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన గోవర్ధన్ గౌడ్, విద్యార్థి దశ నుండే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, స్వామి




వివేకానందల ఆదర్శాలతో సామాజిక సేవలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన చేసిన సేవలు కుటుంబ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడం. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం, వృద్ధులకు, పేదలకు ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం. మహిళా సాధికారత, యువత అభివృద్ధి కోసం కృషి చేయడంతో పాటు మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాల నిర్వహణలో భాగస్వామి కావడం. ఈ సందర్భంగా డాక్టర్ ఆకుల రమేష్ మాట్లాడుతూ,గోవర్ధన్ గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. అవార్డు గ్రహీత గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించినందుకు ఆకుల రమేష్ కి, సహకరించిన డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారంతో సామాజిక సేవ పట్ల తనపై మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో సేవలను మరింత విస్తృతం చేస్తానని పేర్కొన్నారు.

# ఉత్సాహంగా పోచమ్మ బోనాల పండుగ

**కాల్వ శ్రీరాంపూర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా ఆరేపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల పండుగ ఉత్సాహంగా జరిగింది. గ్రామ ప్రజలు, యువతీ--యువకులు, బంధుమిత్రులు పాల్గొని ఆనందంగా జరుపుకున్నారు. పోచమ్మ తల్లి దీవెనలతో పాడి పంటలు, గ్రామ ప్రజలు రక్షణ పొందాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గరిడే లక్ష్మీఅశోక్, ఉపసర్పంచ్ లోమిత రమ్యమహేందర్, గ్రామ పాలకవర్గ సభ్యులు, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.





# ప్రతి మహిళకు గౌరవం, భద్రత, ఆర్థిక బలం కల్పించే దిశగా నిరంతరం కృషి

**- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**




**దేవరకొండ మార్చి 11.**
పిఎ పల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం, మేడారం గ్రామాలలో ఎన్ ఆర్ ఈజిఎస్ నిధుల నుండి మంజూరైన 10.00 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలు నాయక్,అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు.

అంగడిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇంటి యజమానికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. పిఎ పల్లి మండలంలోని తిరుమలగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును అధికారులతో కలిసి ప్రారంభించడం జరిగింది. పిఎ పల్లి మండలంలోని పిల్లిగుండ్ల తండా, రాంపురం గ్రామాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది. పిఎ పల్లి మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఇటీవల మరణించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా సమాఖ్య సంఘ భవనం మహిళా సంఘాల కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత బలపడాలని ఆయన అన్నారు.గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, ఈ భవనం ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల ముఖ్య నాయకులు,మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**- మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్**



**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లులో పేరుకుపోయిన ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ తెలిపారు.బుధవారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్‌లతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సదుపాయాలు, సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రజలు సీసీ రోడ్ల నిర్మాణాలు, అండర్ డ్రైనేజీ పనులు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీరు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి అంశాలను ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు.ఛైర్మన్ పత్యనాయక్ మాట్లాడుతూ, “వార్డుల సమగ్రాభివృద్ధికి చొరవ తీసుకుంటాం. ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలి. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి” అని పేర్కొన్నారు.వార్డుల్లో డ్రైనేజీలు, నీటి సరఫరా పరిస్థితులను పరిశీలించిన ఆయన, ప్రజలు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా నిర్వహించడం, కార్యాలయాల పరిశుభ్రత, పన్ను వసూళ్లు, ఫైల్స్ క్లియరెన్స్, నిరంతర తాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పుల్లారెడ్డి అనూష శ్రీశైలం, విద్యానగర్ కాలనీ అధ్యక్షుడు ఎంఏ పాషా, కాలనీ వాసులు ఉదయ్, శేఖర్, రహీం, సాయి, శ్రీకాంత్, సతీష్, శ్రీనివాస్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న సిఐ జానకిరామ్ రెడ్డికి సన్మానం



**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు ఎస్.హెచ్.ఓ గా విధులు నిర్వర్తించి బదిలీపై తలకొండపల్లి ఎస్.హెచ్.ఓ గా వెళ్తున్న జానకిరామ్ రెడ్డిని బుధవారం ఆమనగల్లు సర్కిల్ కార్యాలయంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువల సత్కరించి అభినందించారు. ఉద్యోగులకు బదిలీలు సహజమేనని అన్నారు. 11 నెలలుగా ఆమనగల్లు పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలో ప్రజలకు ఎన్నో విశేష సేవలు అందించాలని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

## బోగస్ ఓట్లపై ఫిర్యాదు



**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ 7వ వార్డులో జరిగిన బోగస్ ఓట్ల నమోదుపై స్పందించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ కోఆర్డినేటర్, కాంగ్రెస్ అభ్యర్థి కృష్ణ నాయక్ కలిసి విజ్ఞప్తి చేశారు.బుధవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన ఆదివాసి విస్తృత స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన టీపీసీసీ అధ్యక్షుడిని కృష్ణ నాయక్ కలిసి, అక్రమ ఓట్ల కారణంగా తన విజయావకాశాలు ఎలా దెబ్బతిన్నాయో వివరించారు.

**ఇందిరమ్మ బిల్లులు మంజూరు చేయాలని**
**వినతిపత్రం సమర్పించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**




**వెల్దండ, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.మంగళగిరి సుహాసిని (ఆంజనేయులు కుమార్తె), మట్ట శోభ (వెంకటయ్య కుమార్తె), బస్నమోని సరిత, కొమ్ము రజిత (రమేష్ కుమార్తె) వంటి లబ్ధిదారులు బిల్లులు మంజూరు కావాలని ఎదురుచూస్తున్నారని సర్పంచ్ వివరించారు.వినతిపత్రంపై స్పందించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, త్వరలోనే వారికి బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## ఆమనగల్ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**ఆమనగల్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక--99లో భాగంగా ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాటర్ ట్యాంక్, ఎలక్ట్రిక్ వర్క్స్, మౌలిక సదుపాయాలను పరిశీలించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శార్వాణి ఆధ్వర్యంలో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్‌ను గుర్తించారు. విద్యార్థులు, అధ్యాపకులు రాజకుమార్, గోపాల్, శ్రీవాణి నవనీత, రాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నమ్మకమే నా ? - వారి సంక్షేమమే నా లక్ష్యం

**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**



**దేవరకొండ మార్చి 11. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
గుడిపల్లి మండలంలోని సింగరాజు పల్లి, కోదండాపురం గ్రామాలలో 20లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలు నాయక్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా శానిటేషన్, హైజీన్ తనిఖీలు



**తూప్రాన్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో వాటర్ క్లోరినేషన్ టెస్టులు నిర్వహించారు.తరువాత పబ్లిక్ టాయిలెట్లు సందర్శించి శానిటేషన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పట్టణ ప్రజల ఆరోగ్య దృశ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలలో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతపై తనిఖీలు చేపట్టి వంట సామాగ్రి, పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వాహకులకు కమిషనర్ హెచ్చరిస్తూ, “కల్తీ ఆహార పదార్థాలు వాడకం గాని, పరిశుభ్రత పాటించకపోవడం గాని గుర్తించిన యెడల చట్టపరమైన చర్యలు తప్పవు” అని స్పష్టం చేశారు.

## తడి--పొడి చెత్త వేరుచేయాలి

**-- మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్**



**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, తడి--పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ సూచించారు.బుధవారం పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఆయన డంపింగ్‌యార్డు, డ్రైనేజీలను పరిశీలించారు. నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, గంజ్ నాలలో స్టీల్ పూర్తిగా తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు.డంపింగ్‌యార్డులో తరచూ మంటలు అంటుకోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కౌన్సిలర్ పుల్లారెడ్డి అనూష శ్రీశైలం, మాజీ వార్డు సభ్యుడు పూసల సత్యం, శానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్, నాయకులు దేరంగుల వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకా తప్పనిసరి

**-- పశువైద్యాధికారిణి ఝాన్సీ**



**ఎలిగేడు, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పనిసరిగా వేయాలని మండల పశువైద్యాధికారిణి ఝాన్సీ సూచించారు.బుర్హాన్మియాపేట గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 105 పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ గోపు రజిత--లక్ష్మారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, గోపాలమిత్రలు పెద్ది సమ్మయ్య, ఫక్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు ఎస్.హెచ్.ఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు




**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌కు నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆయనను ఇక్కడికి బదిలీ చేశారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఆయన, స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.నూతన ఎస్.హెచ్.ఓగా నియమితులైన వెంకటేశ్వర్లుకు స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయనతో ప్రజలు మంచి సంబంధాలు ఏర్పరుచుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యం

**- సర్పంచ్ ప్రశాంతి రవికుమార్**
**- రూ. 20 లక్షలతో జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ**



**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని సర్పంచ్ తెల్గమల్ల ప్రశాంతి రవికుమార్ అన్నారు. బుధవారం ఆమనగల్లు మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఆమె స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రశాంతి రవికుమార్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధి పరచాలని లక్ష్యంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే చెన్నంపల్లి గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగినది తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమణ రెడ్డి, ఉప సర్పంచ్ గడుసు రాములు, పంచాయతీ సెక్రటరీ పవన్ కుమార్ రెడ్డి, వార్డు సభ్యులు సందమల్ల కృష్ణయ్య, తెల్గమల్ల అమృత, కల్లు గీత, గజ్జె మల్లేష్, మడ్డెలా శిరీష, కొమ్ము సంధ్యారాణి, కొమ్ము జగన్, ముత్యాలు, నర్సింహా, తెల్గమల్ల నర్సింహా, బోదాసు కృష్ణయ్య, తిరుపతి, మందగళ్ళ కేశవ్ తదితరులు ఉన్నారు.

# డంపింగ్ యార్డు తరలించాలి

**- పాపిశెట్టి రాము**



**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని గుర్రం గుట్ట కమల నగర్ కాలనీలో నివాస గృహాల మధ్యగల మున్సిపాలిటీ డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ వలన కాలనీవాసులు రోగాల గురవుతున్నరని వారి అభ్యర్థన మేరకు బుధవారం డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డులోని చెత్తను డంపింగ్ యార్డు తరలించి నిప్పు పెడుతున్నారని, వ్యర్థాల నుంచి వచ్చే పొగతో శ్వాసకోస వ్యాధులు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దీనిని తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఉపవాసదీక్ష..ఆత్మ ప్రక్షాళన..

# చెడు వ్యసనాలకు స్వస్తి..

- రేయింబవళ్లు ప్రార్థనలు
- జకాత్, ఫిత్రా, సధ్ఖ
- నెలరోజుల పాటు కఠోర
ఉపవాస దీక్షలు పేరుతో నిరుపేదలకు దానం





**స్వీయ నియంత్రణ**
ఉపవాసం (రోజా) పాటించడంతో మనిషి చెడు నుంచి నియంత్రణలోకి వస్తాడు. పేదలు పడే ఇబ్బందులు తెలుస్తాయి. ఫలితంగా తనకు తానుగా మంచి మార్గంలో ప్రయాణం చేసేందుకు ఉపవాసం ఉపయోగపడుతుంది.

- మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్
ఆమనగల్లు.

**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ముస్లింలకు పవిత్రమైన మాసం రంజాన్. దివ్య ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి ఈ మాసంలోనే వచ్చిందనేది ప్రతీతి. ఈ నెలలో ఉపవాస దీక్ష ద్వారా శరీరాన్ని శుష్కింప చేయడం వల్ల ఆత్మ ప్రక్షాళన అవుతుందని ముస్లిం సోదరుల నమ్మకం. తద్వారా కామా, క్రోధ, లోభ, మోహ, మధ, మత్సర్యాలు అదుపులో ఉంటాయి. వ్యక్తిలో ఉండే సహన శీలత, భక్తి, చెడు మార్గాలకు స్వస్తి, రేయింబవళ్లు ప్రార్థనలు ఇలా అన్ని రకాల మంచి గుణాలను పరీక్షించేందుకు రంజాన్ మాసం ఉపయోగకరంగా ఉంటుంది. (ఫజర్) నమాజ్ కంటే ముందు సుమారు ఉ.5 గంటలకు అన్న పానీయాలను సేవించి ఉపవాస దీక్షలు ప్రారంభించడం, అనంతరం సాయంత్రం(మగ్రిబ్) నమాజ్ సమయంలో ఇఫ్తార్ దీక్ష విరమించి భోజనం చేస్తారు. ముఖ్యంగా ముస్లింలు అత్యంత ప్రాధాన్యం గల రంజాన్ నెల లోకాన్ని ఆధ్యాత్మిక పథంలో పాయనింపజేసే ఈ మాసంలో ముస్లింలు తమ జీవన విధానాన్ని పూర్తిగా మార్చుకుంటారు. రంజాన్ మాసం ఉపవాస సమయంలో మనిషి పాపకార్యాలకు పాల్పడరాదు. అబద్ధం, అన్యాయం, పరనిందకు దూరంగా ఉంటాడు. సుమారు 30 రోజుల పాటు దీక్షలు చేస్తారు. అనంతరం రంజాన్ పండుగ (ఈద్–ఉల్–ఫితర్)ను నిర్వహిస్తారు.

**ఉపవాస దీక్ష విశేషాలు ప్రత్యేకతలు**
రంజాన్ మాసానికి ప్రత్యేకతలు ఉన్నాయి. దీక్షలు పాటించి మనస్ఫూర్తిగా ప్రార్థనలు చేస్తే అల్లాహ్ వారందరి కోరికలను తిరుస్తాడాని నమ్మకం. ఈ మాసంలోని 30 రోజుల దీక్షను 3 భాగలుగా విభజించి వాటికి ప్రాధాన్యం కల్పించారు. మొదటి 10 రోజుల్లో దీక్షలు పాటిస్తే అల్లాహ్ కరుణ వర్షాన్ని కురిపిస్తాడాని. రెండవ 10 రోజులు చేసిన పాపాలను హరిస్తాడాని, మిగిలిన 10 రోజుల దీక్షని పూర్తి చేస్తే నరకదండన నుంచి విముక్తి లభిస్తుందని ముస్లింలు భావిస్తారు.

# స్వయంపాలనతో నాయకత్వ లక్షణాలు

**-- మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్**





**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్వయంపాలన దినోత్సవం ఎంతో ఉపయోగకరమని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ అన్నారు.బుధవారం పట్టణ కేంద్రంలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ఛైర్మన్ ప్రదీప్‌కుమార్, కరస్పాండెంట్ శివలింగం, యాజమాన్యం సంజీవ్‌కుమార్, కోట్ల వెంకటేష్, శైలజకుమార్ అధ్యక్షతన సరస్వతి పూజ నిర్వహించి స్వపరిపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ పత్యనాయక్ మాట్లాడుతూ, "విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదు" అని సూచించారు. ఒకరోజు ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వయంపాలనలో భాగస్వాములవ్వడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.తరువాత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమతి, వనజ, మౌనిక, గీతాంజలి, మహేష్, బాలవర్ధన్, రమేష్, అనుష, జ్యోతి, సునీత, మానస, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**మహబూబాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు.99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఫైళ్ల క్లియరెన్స్, సానిటేషన్, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని, స్క్రాప్ తొలగించాలని, కాలనీల్లో విద్యుత్--నీటి సరఫరా అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు.కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, కమిషనర్ రాజేశ్వర్, తహసిల్దార్ రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

**- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**
**- తాగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం**



**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పని చేస్తోందని ఆ ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం వెల్దండ మండలం శంకర్ కొండ తండాలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో రూ. 1.50 లక్షలతో తాండలో త్రాగునీటి శుద్ధి కేంద్రం (వాటర్ ప్లాంట్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలు కాకుండా శుద్ధి చేసిన సురక్షితమైన నీరు తాగాలని అన్నారు. ప్రజలు తమ ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్లు ఇస్లావత్ రవీందర్ నాయక్, రమేష్ నాయక్, ఉప సర్పంచ్ పరమేశ్వరి విజయ్, మాజీ సర్పంచ్ నారాయణ మరియు శంకర్ కొండ వార్డు సభ్యులు కళ్యాణ్, గాన్సీ రామ్, రవి, గోపాల్, రత్ని, బుజ్జి, స్థానిక నాయకులు, గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**వెల్దండ, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా గురుకుల బాలికల పాఠశాల (ఎస్సీ)ను కూడా పరిశీలించారు.ఇటీవల వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, వసతి గృహంలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఆకస్మిక తనిఖీ చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, తాగునీరు, ఆహారం, పరిశుభ్రత, వసతి తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. హాస్టల్‌లో ఉన్న లోపాలను త్వరితగతిన సరిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, "గిరిజన గురుకుల బాలికల వసతి గృహంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి" అని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి, వెల్దండ ఎమ్మార్వో కార్తీక్ కుమార్, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్పీజీ కొరతపై భయాందోళన వద్దు..

### అనవసరంగా బుకింగ్ చేయవద్దు: కేంద్రం



**న్యూఢిల్లీ మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశంలో ఎల్పీజీ సిలిండర్ల కొరతపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో గ్యాస్ బుకింగ్‌లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఎల్పీజీ సిలిండర్ల కొరతపై ఎలాంటి భయాందోళనలు వద్దని తెలిపింది. అనవసరంగా గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేయవద్దని సూచించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా చమురుతోపాటు ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఎల్పీజీ సిలిండర్ల కొరతతో పాటు రేట్లు పెరుగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ముందు జాగ్రత్త కోసం గ్యాస్ సిలిండర్లు బుక్ చేస్తున్నారు.కాగా, కేంద్ర ప్రభుత్వం బుధవారం దీనిపై స్పందించింది. దేశంలో తగినంత ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని తెలిపింది. ప్రస్తుతం దేశంలో రోజుకు దాదాపు 55 లక్షల బ్యారెళ్ల ముడి చమురు అందుబాటులో ఉన్నదని మీడియా సమావేశంలో ప్రభుత్వ అధికారి వివరించారు. మరోవైపు ఈ కాలంలో సాధారణంగా హార్మూజ్ జలసంధి ద్వారా వచ్చే దానికంటే ఎక్కువగా చమురు, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం దేశంలోని డిమాండ్‌ను తీర్చడానికి తగినంత సేకరణ కూడా జరుగుతున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో దయచేసి అనవసరమైన ఎల్పీజీ బుకింగ్‌లను నివారించాలని ప్రజలను కోరింది.


# ముందు మీరు అంతం కాకుండా చూసుకోండి..

### ట్రంప్‌నకు ఇరాన్ ఘాటు హెచ్చరిక



**టెహ్రాన్,మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అగ్రరాజ్యం అమెరికాపై ఇరాన్ ధిక్కార స్వరం మరింత పెంచింది. ఇరాన్ కొత్త సుప్రీం మొజ్తబా ఖమేనీ ప్రశాంతంగా జీవిస్తారన్న నమ్మకం తనకు లేదని, తన నియామకం పట్ల ఆయన సంతోషంగా లేరని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించింది. 'మీ వట్టి బెదిరింపులకు ఇరాన్ భయపడదు. మీ కన్నా గొప్ప నేతలే ఇరాన్ దేశాన్ని ఏమీ చేయలేక పోయారు.ముందు మీరు అంతం కాకుండా జాగ్రత్త పడండి' అంటూ ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజాని హెచ్చరించారు. కాగా, ఇరాన్ తాజా హెచ్చరికలతో ఇరాన్ నుంచి ట్రంప్ ప్రాణాలకు ముప్పు ఉందన్న విషయం మరోసారి ప్రచారంలోకి వచ్చింది. ఇరాన్.. ట్రంప్‌ను హత్య చేయడానికి లక్ష్యంగా చేసుకుందని, అతని ప్రాణానికి ముప్పు ఉందని, ఇప్పటికే పలు బృందాలు ఆ పనిపై దేశంలో సంచరిస్తున్నాయని ఆ దేశ జాతీయ భద్రతా అధికారులు ట్రంప్ యంత్రాంగాన్ని హెచ్చరించారు.

# లొంగిపోయిన 108మంది మావోయిస్టులు



**రాయ్‌పూర్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
108మంది మావోయిస్టులు లొంగిపోయారని ఛత్తీస్‌గఢ్ అధికారులు బుధవారం తెలిపారు. వారిపై రూ.3.95కోట్ల రివార్డు ఉందని అన్నారు. దంతెవాడ నుండి 30మంది, సుక్మా నుండి 18మంది, బస్తర్ నుండి 16మంది, నారాయణపూర్ నుండి నలుగురు మరియు కాంకెర్లో నుండి ముగ్గురు లొంగిపోయారని, వీరంతా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన వారని భద్రతాదళాలు తెలిపాయి. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమాండర్లు ఉన్నారని, ఒక్కొక్కరిపై ఎనిమిది లక్షల వరకు రివార్డు ఉందని పేర్కొన్నాయి. వారి ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించాయి.

# మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి -

### అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**మహబూబాబాద్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, "మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో మహిళలను ప్రోత్సహిస్తున్నాం. తల్లులు, శిశువుల ఆరోగ్య సంరక్షణ, సురక్షిత తాగునీరు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం" అని తెలిపారు.కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు శ్రీనివాస్, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రజిత, ఐసిడిఎస్ సిబ్బంది, సఖి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**నాగర్‌కర్నూల్, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని 22వ వార్డులో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పట్టణంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వల్ల 22వ వార్డులో ఒత్తిడి తగ్గి మెరుగైన సరఫరా అందుతుంది" అని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్‌చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్ మాధవి రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

### - ఎంఈఓ నరేంద్ర చారి






**ఎలిగేడు, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 14న ప్రారంభమయ్యే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ నరేంద్ర చారి సూచించారు.సల్తాన్పూర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "భయం వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. కృషి చేస్తే గుర్తింపు తప్పక వస్తుంది" అని అన్నారు. విద్యార్థులకు పరీకాప్షడు, పెన్సిల్స్ అందజేశారు.కార్యక్రమంలో సర్పంచులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హోటళ్లు, వైన్స్ షాపులలో కమిషనర్ తనిఖీలు




**ఆమనగల్లు, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, వైన్స్‌షాపులను మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో పరిశుభ్రత లోపం, కాలం చెల్లిన ఆహార పదార్థాల విక్రయం, ట్రేడ్ లైసెన్స్ లేకపోవడం వంటి ఉల్లంఘనలను గుర్తించారు. నిబంధనలు పాటించని యజమానులపై అధికారులు భారీ జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం కోసం పరిశుభ్రత, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.కమిషనర్ వెంట మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, శానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్, సిబ్బంది శ్రవణ్, మనీషా, సికిందర్, దశరథ్, మహమూద్, సురేష్ తదితరులు ఉన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**వెల్దండ, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని 3వ వార్డులో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను బుధవారం స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, వార్డు సభ్యులు గుద్దటి కిష్టల్, పాలకవర్గ సభ్యులు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, "గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్డు పనులు చేపట్టాం. చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఈ రహదారి పూర్తయితే రాకపోకలు సులభమవుతాయి. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేస్తూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం" అని తెలిపారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, ఉపసర్పంచ్ శీను ముదిరాజ్, వార్డు సభ్యులు ముదిగొండ కవిత రమేష్, గోసుల కొండయ్య, పిల్లి దేవేందర్, రేవెల్లి మానస రాజు, బాదేపల్లి రమేష్, సిరసనగండ్ల శేఖర్, వాణి పురుషోత్తమ చారి, రంగనాథం మల్లీశ్వరి, గోపి రెడ్డి రాఘవరెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, ఎండి హమీద్, మంగళగిరి శీను, మాడుగుల శంకర్, జోగు రవికుమార్, ఈదులపల్లి రాజు, మట్ట మల్లేష్ గౌడ్, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల వినతిపత్రం




**వెల్దండ, మార్చి 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆశా వర్కర్లు నిరసన చేపట్టి పెండింగ్ జీతాలు, బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు.ఆశా వర్కర్లు మాట్లాడుతూ, "18 ఏళ్లుగా ప్రజా ఆరోగ్య సేవల్లో ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేస్తున్నాం. కానీ కనీస వేతనాలు అందడం లేదు. కరోనా సమయంలోనూ సేవలు ఇచ్చినా బకాయిలు చెల్లించలేదు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మంద శంకర్, ఆశా వర్కర్లు రజిని, రేణుక, జ్యోతి, విజయ తదితరులు పాల్గొన్నారు.